
క్లుప్తంగా

ఈ-హాస్పిటల్ అప్లికేషన్‌పై శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెక్స్‌జెన్ ఈ-హాస్పిటల్ అప్లికేషన్‌పై గురువారం వైద్యులు, పీజీలకు శిక్షణ ఇచ్చారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నిర్వహించిన ఈ శిక్షణను ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీరాములు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఈ -హాస్పిటల్ అప్లికేషన్‌ను నెక్స్‌జెన్ ఈ-హాస్పిటల్‌గా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇది రోగి రిజిస్ట్రేషన్, అడ్మిషన్, క్లినికల్ డేటా రికార్డింగ్‌తో సహా ఆసుపత్రి కార్యకలాపాలు, వివిధ అంశాల నిర్వహణను కూడా సులభతరం చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీఎంఓలు, పీజీలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బీవీ రావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ ఎంపీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో-2 మేనేజర్‌గా శర్మ



కర్నూలు సిటీ: ప్రజా రవాణా సంస్థ కర్నూలు డిపో-2 మేనేజర్‌గా కె.ఎల్.కె శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. డిపో-2 మేనేజర్‌గా పని చేస్తున్న సర్దార్ హుసేన్ గత నెల 30వ తేదీన రిటైర్ అయ్యారు. అప్పటినుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టులో ఇటీవల కె.ఎల్.కె శర్మను నియమించారు. ఈయన గతంలో కర్నూలు జిల్లాలో పని చేశారు. అదేవిధంగా కడప, ప్రొద్దుటూరు, కదిరి డిపోల్లో పని చేశారు. విజయవాడలోని కేంద్ర కార్యాలయంలో పని చేస్తూ కర్నూలు డిపో-2 మేనేజర్‌గా వచ్చారు. బాధ్యతలు తీసుకునేందుకు ముందుగానే కె.ఎల్.కె శర్మ జిల్లా ప్రజా రవాణా సంస్థ రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 9న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఎన్ఆర్ పేట, సంకల్‌భాగ్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా చిన్మయానంద జయంతి



చిన్నారులతో స్వామిని సుప్రేమానంద సరస్వతి

కర్నూలు కల్చరల్: పూజ్య స్వామి చిన్మయానంద మహారాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వీఆర్ కాలనీలోని చిన్మయానంద ప్రభావళిలో జరిగిన వేడుకల్లో చిన్మయ బాలల సంస్కార సాధనా శిబిరంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి సందేశమిచ్చారు. ప్రపంచ శాంతి కోసం, ఆధ్యాత్మిక పెంపుదలకు, హిందూ ధర్మ పరిరక్షణకు చిన్మయ మహరాజ్ ఎంతో కృషి చేశారన్నారు. దాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ భగవద్గీత పుస్తకాలను అందజేశారు. మిషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ, బీఈడీ ఫలితాలు వెల్లడించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఒక ప్రకటనలో కోరా రు. వర్సిటీ అధికారుల అలసత్వంతో వందలా ది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ ర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్‌పై చర్యలు తీ సుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తూ గుడిసె దగ్ధం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామ సమీపంలోని పొలాల మధ్యలో ఉన్న తిప్పన్న తాత మఠానికి చెందిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమైంది. గురువారం సాయంత్రం పక్కన ఉన్న పొలంలో ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. మంటలు చెలరేగి పక్కనే ఉన్న గుడిసె అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పేలోగా పూర్తిగా కాలిపోయింది. మఠానికి సంబదించిన వంట సామగ్రి, వస్తువులు కాలిపోయి రూ.50వేలు నష్టం వాటిలిందని మఠం నిర్వాహకులు తెలిపారు.

హైవేపై వాహన రాకపోకలు పునరుద్ధరించండి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కాటసాని

కల్లూరు: కర్నూలు నగర శివారులో ఔటర్ రింగ్ రోడ్డు కింద చెన్నై నుంచి సూరత్ నేషనల్ హైవే సొరంగం పనులు చేస్తుండగా గురువారం సాయంత్రం నేల అకస్మాత్తుగా కుంగి పెద్ద గొయ్యి ఏర్పడింది. రోడ్డు పక్కనే గొయ్యి ఏర్పడటంతో జాగ్రత్త చర్యగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వాహనాలను ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా మళ్లించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంట ఉన్నారు.



నేల కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

● జాతీయ రహదారి రోడ్డును ఆనుకుని నేల కుంగడంతో విషయం తెలుసుకున్న కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను మళ్లించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కర్నూలు (టౌన్): మనిషి జీవితాన్ని నాశనం చేసే మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఈగల్ సెల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ సుజన్‌కుమార్ సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో సిబ్బందికి మాదక ద్రవ్యాల వినియోగం, వాటి బారిన పడిన వారిని గుర్తించడం తదితర వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం అరికట్టేందుకు ప్రభుత్వం ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూపు ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడిన వారి గురించి టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1972 నంబర్ ద్వారా సమాచారం అందించాలన్నారు. గంజాయి పెంచినా, పంచినా, పీల్చినా నేరమన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, సానుకూల ప్రవర్తనను అలవర్చు కోవాలన్నారు. ఈగల్ సెల్ టీమ్ సభ్యులు ఎలీషా, మాసూం వలీ, సీఎంఆర్ అసిస్టెంట్ మేనేజర్ చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఈగల్ టీమ్ సభ్యులు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): క్రీడల వల్ల విద్యార్థినీ, విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న అన్నారు. గురువారం స్థానిక టౌన్ మోడల్ క్రీడా ప్రాంగణంలో నగరపాలక సంస్థ, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం సంయుక్త ఆధ్వర్యంలో తైక్వాండో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. చిన్నారులు తైక్వాండో విన్యాసాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తైక్వాండో నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. చురుకుద నంతో చదువుల్లోనూ రాణించవచ్చన్నారు. ప్రభుత్వ జూనియర్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, న్యాయవాది శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, తైక్వాండో శిక్షకులు సతీష్‌కుమార్, వీరేష్‌బాబు, శివ పాల్గొన్నారు.



తైక్వాండో వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సుంకన్న

బయో మైనింగ్ పనులు పూర్తి చేయాలి

● నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు వెల్లడి



బయో మైనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని గార్గేయపురంలో ప్రారంభమైన బయో మైనింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం డంప్ యార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయో మైనింగ్ ద్వారా చెత్తను శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. డంప్ యార్డులో నిల్వ ఉన్న దాదాపు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రానున్న మూడు నెలల్లోపు బయో మైనింగ్ ద్వారా శుద్ధీకరణ చేసే చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

సెట్కూర్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. మెనూ, టోకెన్ల సంఖ్య, శుభ్రత అంశాలపై ఆరా తీశారు. నిర్వహణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అలాగే కొత్తబస్టాండ్, గుత్తి పెట్రోల్ బంకు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ గంగాధర్ పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పిస్తాం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పిస్తామని ఏపీఓ రమాదేవి అన్నారు. గురువారం కె.మార్కాపురంలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను ఆమె పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. నిర్దేశిత కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో డోలోత్సవం

కల్లూరు: కల్లూరులోని అమ్మవారి శాలలో గురువారం వాసవీ మాత జయంతి, డోలోత్సవం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

10న మద్దిలేటి స్వామి కల్యాణోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామ శివారులో (జాతీయ రహదారి) పక్కన మునిస్వామి మిట్టపై వెలసిన ఆది చింతలమునిస్వా మి, నల్లారెడ్డి స్వాముల వారి దేవాలయంలో శ్రీలక్ష్మి సమేత మద్దిలేటి స్వాముల కల్యాణో త్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజారి మునిస్వామి ఆశీస్సులతో నరసింహ స్వామి జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ఉదయం 11:45 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ఉత్స వమూర్తులకు విశేష ద్రవ్యములచే అభిషేకం, గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహిస్తారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత మద్దిలేటి స్వామి కల్యాణం జరిపిస్తారు. మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, మధ్యా హ్నం 12 గంటలకు గ్రామ పెద్దలు, భక్తాదుల చే అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవం, రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అఖండ భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు కోరారు. దామోదరం సంజీవయ్య 53వ వర్థంతి సందర్భంగా ఆయన స్వగ్రామం పెద్దపాడును కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. సాయంత్రం కర్నూలులోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు దామోదరం సంజీవయ్య అన్నారు. ఆయన సేవలు, గొప్పతనం భవిష్యత్తు తరాలకు తెలియాలంటే ఆయన నివాస స్థలంలో స్మృతి వనం, లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రజలందరూ భారత ప్రభుత్వానికి, సైనికులకు మద్దతుగా ఉండాలన్నారు. కర్నూలు ప్రగతి సమితి అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష, డాక్టర్ కె.హరినాథ రెడ్డి, దామోదరం సంజీవయ్య వారసుడు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పూదోట ప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): పలు డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. గురువారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రి డిస్పెన్సరీ, పీహెచ్‌సీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో కార్మికులకు జీతాలు సరిగా చెల్లించకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయని ఏజెన్సీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కోరారు. కార్మికులకు వారాంతపు సెలవుతో పాటు ఆర్జిత సెలవులు, జాతీయ సెలవులు, మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి పి.ప్రణీత్, జీజీహెచ్ యూనియన్ నాయకులు ఎం.రాజు, బి.నాగేషులు, బాలరాజు, సురేష్, శివ పాల్గొన్నారు.

పొగాకు కొనని కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట పొగాకు రైతుల ధర్నా

కర్నూలు(సెంట్రల్): పొగాకును కొనని కంపెనీలు, దళారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పొగాకును కొంటామని చెప్పిన కంపెనీలు ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం క్వింటాల్ రూ.20 వేల వరకు ధర పలికితే ప్రస్తుతం రూ.10 వేలు దాటడం లేదని చెప్పారు. కాగా, రైతు సంఘం నాయకులు, పోలీసుల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం వారు డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ఏ.కృష్ణ, నాగ న్న,ఆంజనేయులు, బాలపీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుని తిరునాల

వెల్దుర్తి: మండలంలోని ఎల్ నగరం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 44వ తిరునాల ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వెంకటస్వామితాత 4వ ఆరాధనోత్సవం అనంతరం గురువారం పూజారి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గణపతి, శ్రీరాములు వారు, వీరబ్రహ్మేంద్రస్వామి పటాలతో ప్రభోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి నందికోలసేవతో ప్రారంభమై చెన్నకేశవ స్వామి ఆలయం వరకు సాగింది. ఆనవాయితీగా దేశాయ్ కుటుంబ సభ్యులు వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి తొలినైవేద్యం అందించారు.

నేడు బండలాగుడు, పరుగుపందెం పోటీలు..

ఉత్సవాల సందర్భంగా పాలపండ్ల వృషభాలకు బండలాగుడు పోటీలు శుక్రవారం నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పరుగు పందెం విజేతలకు వరుసగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి నగదు బహుమతి అందజేస్తామన్నారు.

వైభవంగా రథోత్సవం

ఆదోని రూరల్: మండలంలోని పెసలబండ గ్రామంలో గురువారం సాయంత్రం జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం భక్తుల మధ్య వైభవంగా సాగింది. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథాన్ని ముందుకు లాగారు.

వీరంపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

గోనెగండ్ల: మండల పరిధిలోని వీరంపల్లి గ్రామంలో గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి 29వ తిరుణాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం గ్రామోత్సవం, స్వామివారి దంపతుల కళ్యాణం, సాయంత్రం రథోత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుణాల సందర్భంగా గ్రామంలో పరుగు పందెం, బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సంజీవయ్యస్వామి పరుగు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.



భక్తుల మధ్య ముందుకు సాగుతున్న రథం

టెక్స్‌టైల్ పార్క్ పేరుతో చేనేతలను మోసం చేయకండి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు భూమి పూజ అంటూ చేనేతలను మభ్యపెట్టకుండా నిర్మాణాన్ని పూర్తి చేసి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎంకె శివ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చేనేతలను ఆదుకోవాలన్న తలంపుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి మగ్గం వున్న ప్రతి నేత కార్మికుడికి ఏటా రూ.24వేలు ఆర్థిక సహాయం అందించిందన్నారు. దీంతో నేతలు ముడిసరుకు కొనుగోలుకు వస్త్ర తయారీకి ఎంతో ఉపయోగపడిందన్నారు. అదేవిధంగా చేనేతలకు ప్రతి నెల 100 యునిట్ల ఉచిత విద్యుత్ అందించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు 200ల యునిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిందే కాని 11 నెలలైనా నేటికి అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. కాగా బనవాసి వద్ద 77 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రులు భూమి పూజ చేశారే కాని ఇందుకు నిధుల కేటాయింపు, చేనేతలకు ఏవిధంగా ఉపాధి చూపుతారో, ముడిసరుకు ఇస్తారా, యువతకు ఏమైనా శిక్షణ ఇస్తారా, ఇందుకై ఏమైనా చేనేతలను ఎంపిక చేశారా అన్న అంశాలేవి ప్రకటించలేదన్నారు.

గతంలో రెండు సార్లు శిలాఫలకాలు..

గతంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం రెండు సార్లు శిలాఫలకాలు వేసి భూమి పూజలు చేసిందని అయితే అక్కడ ఒక్క కట్టడం కూడా చేయలేకపోయిందని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు మూడు రోజుల క్రితం శిలాఫలకం, భూమి పూజ చేశారని అయితే ఆ శిలాఫలకం కూడా తీసేయడం పట్ల అనుమానాలు వ్యక్తమతున్నాయన్నారు. కాగా ప్రస్తుతం ఏర్పాటు చేస్తామన్న టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తుందా లేక ఎమ్మెల్యే వెంట వున్న మాస్టర్ వీవర్స్‌కే అప్పజెబుతారా అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. మాస్టర్ వీవర్స్ చేనేతలతో నేతపని చేయించుకొని వారికి ఇచ్చే కూలీలు కూడా సరిగా ఇవ్వక పోతుండటంతో నేటికి ఆయా నేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్.మురవణి వద్ద చేనేతలకు ఇచ్చిన ఇంటి స్థలాల సమస్యలపై కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం తాలూకా అధ్యక్షుడు ఖాశింబేగ్, పార్టీ ఐటీ సెల్ అధ్యక్షుడు మాచాని సోమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కరె రాము, నాయకులు చంద్రశేఖర్, రఘువీర, రఘు, పామయ్య, నరసింహులు పాల్గొన్నారు.

గూడూరులో చోరీ

● 4తులాల బంగారం, 10 తులాల వెండితో ఉడాయించిన దుండగులు



బాధితుడి ఇంట్లో విచారణ చేస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: గూడూరులోని రాజీవీధిలో నివాసముంటున్న మోహన్ ఇంట్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 4 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. మోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసి అనంతపురం జిల్లా యాడికికి బుధవారం వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాను రాడ్‌తో పెకిలించి ఆభరణాలతో ఉడాయించారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసిన చుట్టుపక్కల గురువారం మోహన్‌కు సమాచారం ఇచ్చారు. అతడు గూడురు చేరుకుని చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

తలసీమియాపై అవగాహన పెంచుకోవాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయానందబాబు

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా వ్యాధిపై బాధిత చిన్నారుల తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని ఇండియన్ అసోసియేషన్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ విజయానంద బాబు చెప్పారు. ఐఏపీ కర్నూలు శాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'వరల్డ్ తలసీమియా డే' సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలోని క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ.. తలసీమియా వ్యాధి పట్ల బాధిత చిన్నారుల తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు అవగాహన పెంచుకుని భవిష్యత్‌లో ఇతరులకు ఈ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సెక్రటరీ డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి, డాక్టర్ ప్రకాష్ ఆనంద్, డాక్టర్ సృజనరెడ్డి, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకటన

అందరూ తెలుసుకోవలసిన విషయం ఏమనగా **షేక్ ఫైరోజ్ బాషా, తండ్రి షేక్ గరీబ్ బాషా, కర్నూలు** వాసువారు ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై లోన్ కొరకు నా క్లయింట్ అగు తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్, కర్నూల్ వారిని సంప్రదించినారు. క్రింది షెడ్యూల్ ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ అనగా 4491/ 1988 పోయినవని తెలిపారు. క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై సంబంధించి ఎవరికైనను ఎలాంటి హక్కు అధికారములు ఉన్నచో ఈ తేదీ నుండి 7 రోజుల లోపల తగిన ఆధారములతో నన్ను సంప్రదించగలరు, లేనిచో ఎలాంటి అభ్యంతరములు లేవని లోన్ ఇవ్వబడునని తెలియజేయడమైనది.

SCHEDULE: House bearing No.40/155 in plot No.212 an extended 60 Sq.Yards in Sy.No.86/2 in ward No.40, Bangarupeta, Kurnool City & Dist, Kurnool Sub Registration within the following particulars : H.No.40/155, Plot No. 212. Extent 60 Sq.Yards Sy.No. 86/2 And bounded as follows: **EAST:** Road, **WEST:** House of Naga Raju, **NORTH:** Road, **SOUTH:** Shops of others.

M.SANJEEVA REDDY, Advocate,
H.No. 43-262-1M, N.R.Peta, Kurnool-518001.
Cell No.: 94402 92365

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కర్నూలు
70750 09182

Office mail : sakshiknladvt@gmail.com